క్లుప్తంగా

అర్హులందరికీ లైసెన్స్‌లు మంజూరు చేయిస్తాం



టాపింగ్ టెస్ట్‌లో పాల్గొన్న గీత కార్మికులు, చిత్రంలో కేఎల్ఎన్ ప్రసాద్ తదితరులు

చిలుకూరు: అర్హులైన గీత కార్మికులందరికీ లైసెన్స్‌లు మంజూరు చేయిస్తానని కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపకుడు, ప్రముఖ న్యాయవాది కేఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. బుధవారం చిలుకూరులోని గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో టాపింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా గీత కార్మికులకు టాపింగ్ టెస్ట్‌లు చేయించి లైసెన్స్‌లు మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండా అన్నపూర్ణ, ఎంపీటీసీ బెల్లంకొండ రమణ నాగయ్య, గౌడ సంఘం నాయకులు కొండా సోమయ్య, యడవెల్లి పుల్లారావు, కలాలీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మరథీ సైదులు, కొండా వీరబాబు, డైరెక్టర్ బెల్లంకొండ సూర్యప్రకాశ్, అమరగాని కాశయ్య, కొండా వెంకయ్య, బాలెబోయిన రవి, వీరబాబు, ధనమూర్తి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఓజో ఫౌండేషన్ చేయూత



బాధిత కుటుంబానికి బియ్యం అందజేస్తున్న ఓజో ఇన్‌చార్జ్ వెంకన్న

మఠంపల్లి: నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు చేయూత పథకం ద్వారా విస్తృతంగా సేవలందిస్తున్నట్లు ఫౌండేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్న తెలిపారు. బుధవారం మఠంపల్లిలోని ఎస్సీ కాలనీకి చెందిన నిరుపేద కుటుంబీకులు కస్తాల జోజి, శీతం శౌరిలు పక్షవాతంతో బాధ పడుతుండగా కుటుంబసభ్యులకు 100కేజీల చొప్పున బియ్యం అందజేశారు. కాల్వపల్లితండాకు చెందిన బానోతు గబ్రు కంటి చూపు కోల్పోవడంతో రూ.5వేల నగదు, 50కేజీల బియ్యాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఓజో సభ్యులు రవినాయక్, సుధాకర్, సాయిబాబా, మెస్సీ, బాబు, వెంకటేష్, రాంబాబు, బాలరాజు, నర్సింహ, నిఖిల్, గ్రామస్తులు ఉన్నారు.

ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం శ్రీను, రాధాకృష్ణ

హుజూర్‌నగర్: ప్రభుత్వం ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం శ్రీను, రాధాకృష్ణ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి కార్యాలయ సూపరింటెండెంట్ రవికి అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యల్క సోమయ్య, ఎస్ నాగార్జున, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ



బీరువా అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మునగాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1993– 94 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాలకు బీరువా బహూకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారంగా బీరువా అందజేసినట్లు తెలిపారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు సీతారామరాజు అభినందించారు.

ఇంటింటికీ బీజేపీ

గరిడేపల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 9 ఏళ్ల పాలనపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పూర్తి స్థాయిలో వివరించాలని ఆ పార్టీ విస్తారక్ రాచమళ్ల భాస్కర్‌రావు తెలిపారు. బుధవారం గరిడేపల్లి మండలంలోని గానుగుబండ, కొండాయిగూడెం, చిన్నగారకుంటతండాల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నరేష్, వెంకటేశ్వర్లు, అత్తి వెంకటేశ్వర్లు, రమేష్, వెంకటేశ్వర్లు, సాయి, గోపి పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారం

నడిగూడెం: మండల పరిధిలోని చెన్నకేశ్వాపురంలో కొద్ది రోజులుగా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రామంలో పలు వీధుల్లో గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. ద్విచక్రవాహనాలపై వెళ్లే వారిపై దాడికి పాల్పడుతుండడంతో వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. కుక్కలను వేరే చోటుకు తరలించేలా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చెన్నకేశ్వాపురంలో సంచరిస్తున్న కుక్కలు

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

మునగాల: మండలంలోని ముకుందాపురం గ్రామ పంచాయతీ పరిధిలో చెట్టు కొమ్మల మధ్య నుంచి విద్యుత్‌తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. గాలి వచ్చినప్పుడు తీగలు ఒకదానికొకటి తగిలి మంటలు వస్తున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గాలి వానకు షార్ట్‌సర్క్యూట్ జరిగి విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ తీగలకు తగిలే చెట్ల కొమ్మలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ముకుందాపురంలో చెట్లకొమ్మల మధ్యన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

సాగు పనులు ముమ్మరం

- నడిగూడెం మండలంలో పూర్తి కావొచ్చిన పత్తి విత్తనాలు విత్తడం
- వరి, పత్తి, కంది, పెసర పంటలపై దృష్టి సారించిన రైతులు

నడిగూడెం: గతేడాది కన్నా ఈ ఏడాది రుతుపవనాల రాక కొంత ఆలస్యమైంది. దీంతో సీజన్ ఆరంభంలో కొంత ఆందోళన మొదలైనా రెండు రోజుల కిందట కురిసిన కొద్దిపాటి వర్షానికి మండల వ్యాప్తంగా వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. మొదట్లో కురిసిన చిరు జల్లులకు దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు పత్తి, కంది, పెసర విత్తనాలు విత్తుతున్నారు.

విత్తనాలు, ఎరువుల కొనుగోలులో రైతులు బిజీ..

మండలానికి చెందిన రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు, పొలం పనుల్లో బిజీగా మారారు. నిన్నటి వరకు పొలాలు చదును చేసే పనుల్లో నిమగ్నమైన రైతులు ప్రస్తుతం విత్తనాలు వేస్తున్నారు. ఈ ఏడాది వరి, పత్తి, కంది, పెసర, పంటలపై రైతులు ఎక్కువగా దృష్టి సారించారు. బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, కరివిరాల, వెంకట్రాంపురం, నారాయణపురం, కాగితరామచంద్రాపురం గ్రామాల్లో పత్తి, నడిగూడెం, చాకిరాల, సిరిపురం, వల్లాపురం, శ్రీరంగాపురం, రత్నవరం, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, తెల్లబెల్లి గ్రామాల్లో వరి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే పత్తి విత్తనాలు విత్తే పనులు పూర్తి కావచ్చాయి. ఇతర గ్రామాల్లో బోర్లు, బావుల క్రింద వరి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఆయకట్టు గ్రామాలైన చాకిరాల, రామాపురం, రత్నవరం, ఎకలాస్‌ఖాన్‌పేట, తెల్లబెల్లి, శ్రీరంగాపురం, సిరిపురం, వల్లాపురం గ్రామాల్లో సాగర్ ఎడమ కాల్వకు అనుబంధంగా ఉన్న కొమరబండ, పాలారం, కొత్తగూడెం మేజరు కాల్వల కింద రైతులు వరి సాగు చేపట్టనున్నారు.



పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తగా ఉండాలి



వర్షాలు ఇప్పుడే పడుతున్నాయి. రైతులు ఆందోళన చెందొద్దు. నేల పూర్తిగా తడిసిన తర్వాతనే విత్తనాలు వేసుకోవాలి. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు అనంతరం విత్తనాలకు సంబంధించి రశీదు తీసుకోవాలి. నకిలీ విత్తనాల పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలి.

– రాజగోపాలరావు, వ్యవసాయాధికారి, నడిగూడెం

ఈటల రాజేందర్‌ను కలిసిన జిల్లా నేతలు



ఈటలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాగ్యరెడ్డి



ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి

హుజూర్‌నగర్: రాష్ట్ర బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియామకమైన హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయనను శాలువతో సన్మానించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిరాజు యశ్వంత్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అంబళ్ళ నరేష్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి పత్తిపాటి విజయ్, చింతలపాలెం మండల ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి తదితరులున్నారు. అదేవిధంగా ఈటల రాజేందర్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గట్టు శ్రీకాంత్ రెడ్డి, నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ వేముల శేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు.

అవర్లీ బేసిక్ ఉపాధ్యాయులను కొనసాగించాలి

నాగారం : మోడల్ స్కూళ్లలో గంటల ప్రాతిపదికన పనిచేస్తున్న ఉపాధ్యాయులను కొనసాగించాలని అవర్లీ బేసిక్ టీచర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డబోయిన నాగరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బదిలీల అనంతరం ఖాళీ పోస్టుల స్థానాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న అవర్లీ బేసిక్ ఉపాధ్యాయులను తీసుకోవాలని కోరారు. అవర్లీ బేసిక్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించి, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు.

గృహలక్ష్మి పథకం ద్వారా రూ.6 లక్షలు ఇవ్వాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్: ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులకు రూ.6 లక్షల ఆర్థిక సాయం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదేళ్లు అయినా కొత్త రేషన్ కార్డులు, కొత్త ఇళ్ల నిర్మాణం చేపట్టలేదని ఆరోపించారు. ప్రస్తుతం ఐరన్, సిమెంటు, కూలీల రేట్లు విపరీతంగా పెరిగినందున ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు కాకుండా రూ.6 చెల్లించాలన్నారు. దళిత బంధు, కులవృత్తుల వారికి ప్రభుత్వం చేస్తున్న ఆర్థికసాయంలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు, సీపీఐ పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

గరిడేపల్లి: ఉపాధి హామీ కూలీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు కోరారు. బుధవారం గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జాబ్‌కార్డులున్న వారికి వంద రోజుల పాటు పనులు కల్పించాలన్నారు. కేంద్రం చెప్పుతున్న లెక్కల ప్రకారం రోజుకు రూ.252 కూలి చెల్లించాలన్నారు. ఆయన వెంట ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చికలరాజు శ్రీను, అంజయ్య, నరేష్, లక్ష్మమ్మ, వీరయ్య, సతీష్, పార్వతమ్మ, హనుమంతులు తదితరులున్నారు.



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ధనుంజయనాయుడు

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



నేరేడుచర్లలో శేఖర్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న చల్లా శ్రీలతారెడ్డి

నేరేడుచర్ల: నేరేడుచర్ల మున్సిపాలిటీలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఒగ్గోజు శేఖర్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మున్సిపల్ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి అన్నారు. బాధిత కుటుంబాన్ని బుధవారం ఆమె పరామర్శించి శేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆమె వెంట గ్రంథాలయ కమిటీ చైర్మన్ మార్కండేయ, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సైదులు, గంట సైదులు, వేముల రాజేష్, మురళి, వెంకట్, శ్రీకాంత్, ఉదయ్, ఇంతియాజ్, శ్రవణ్, రాజేష్, గోపి తదితరులున్నారు.

నాగరాజు కుటుంబానికి పరామర్శ

మున్సిపాలిటీలోని రామాపురం గ్రామానికి చెందిన మెండు నాగరాజు ఇటీవల మృతి చెందాడు. మున్సిపల్ వైస్ చైర్మన్ చల్లా శ్రీలతారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

కాలుష్య రహిత విద్యుత్ వాడకమే ధ్యేయం

మఠంపల్లి: మఠంపల్లిలోని సాగర్ సిమెంట్స్ పరిశ్రమలో పరిశ్రమ ఎండీ సమ్మిడి ఆనందరెడ్డి, ఓల్వా కంపెనీ ఎండీ కృష్ణంతో కలిసి బుధవారం ఎలక్ట్రానిక్ లోడర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనందరెడ్డి మాట్లాడుతూ 2030 నాటికి 50శాతం విద్యుత్ వాడకం, 2050 నాటికి 100 శాతం కాలుష్య రహిత విద్యుత్ వాడకమే ధ్యేయమన్నారు. దక్షిణ భారతదేశంలోనే మొట్టమెదటిసారిగా సాగర్ సిమెంట్స్‌లో ఎలక్ట్రానిక్ యంత్రం ప్రారంభించడం జరిగిందన్నారు. రానున్న 30 ఏళ్లలో వాయు కాలుష్యం లేకుండా డీజిల్, బొగ్గు, లైమ్‌స్టోన్, నీరు, ఆయిల్ వాడకం తగ్గించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే బ్యాటరీ ద్వారా నడిచే యంత్రాలు వచ్చాయని, అతి త్వరలో హైడ్రోజన్, పవర్ కనెక్టివిటీతో నడిచే యంత్రాలను తీసుకువస్తామన్నారు. సమావేశంలో గ్రూప్ ప్రెసిడెంట్ గణేష్, వైస్ ప్రెసిడెంట్ అంజిరెడ్డి, సిద్దార్థరెడ్డి, అనీష్‌రెడ్డి, రమణమూర్తి, సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.



ఎలక్ట్రానిక్ లోడర్‌ను ప్రారంభిస్తున్న సాగర్ సిమెంట్స్ ఎండీ ఆనందరెడ్డి

జనసేనను బలోపేతం చేయాలి



జనసేన పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాగేశ్వర్‌రావు

గరిడేపల్లి: జనసేన పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సరికొప్పుల నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెంలో పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్, రవి, సురేష్, సన్నీల ఆధ్వర్యంలో పలువురు జనసేనలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు సాయిరాం, జనరల్ సెక్రటరీ నరేష్, మధు, సైదులు ఉన్నారు.

ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవాలి

హుజూర్‌నగర్: ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కార్డును నవీకరించుకోవాలని పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సందీప్ తెలిపారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని ఉప తపాలా కార్యాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా ఆధార్ కార్డులో పేరు, పుట్టినతేదీ, చిరునామా, మొబైల్ నంబర్, వేలి ముద్రలు, ఫొటో అప్‌డేట్ చేయించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ పోస్టుమాస్టర్ ఖాజా మియా, పోస్ట్‌మాన్‌లు కల్పన, నరేష్, గణేష్, ఎంటీఎస్ నరేందర్, సిబ్బంది దేవదాస్, మహేష్ పాల్గొన్నారు.

పచ్చదనం పెంచేందుకే హరితహారం



మఠంపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ ముడావత్ పార్వతి



కోదాడలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి దయానందరాణి

మఠంపల్లి: రాష్ట్రంలో 24శాతంగా ఉన్న అడవులను 33శాతానికి పెంచేందుకే సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులతో నిర్వహించిన 9వ విడత హరితహారం సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. హరితహారంలో ఉపాధిహామీ కూలీలతో పాటు ప్రజలను భాగస్వామ్యం చేయాలని, దేవాలయాలు, మసీదులు, చర్చిలు తదితర ప్రదేశాల్లో మొక్కలు నాటి పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈఏడాది ప్రభుత్వం ఆగ్రో ఫార్మసీ కింద గంధం, టేకు, వెదురు, సరుగుడు మొక్కలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ జానకిరాములు, స్పెషల్ ఆఫీసర్ సందీప్, ఎంపీఓ ఆంజనేయులు, ఏపీఓ ఉమ, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తదితరులున్నారు.

హరితహారాన్ని విజయవంతం చేయాలి

కోదాడరూరల్: 9వ విడత హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి దయానందరాణి కోరారు. బుధవారం కోదాడ మండల పరిషత్ కార్యాలయంలో హరితహారంపై సమీక్షా సమావేశంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధిహామీ, గ్రామ పంచాయతీలదేనని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ తుమ్మల నాగేశ్వరరావు, ఏపీఓ రానియా, కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో మొక్కల పంపిణీ

గరిడేపల్లి: గరిడేపల్లి మండలం లక్ష్మీపురం గ్రామంలో బుధవారం సర్పంచ్ కుసుమ వెంకటమ్మ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ స్వామిదాస్, ఏఎన్ఎం అనిత, రమణ తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

నేరేడుచర్ల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సర్పంచ్ పల్లెపంగ నాగరాజు అన్నారు. బుధవారం నేరేడుచర్ల మండలంలోని కల్లూరు గ్రామంలో ప్రతి ఇంటికీ ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రోడ్ల వెంట 15 వేల మొక్కలను నాటాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పద్మ, ఫీల్డ్ అసిస్టెంట్ శోభన్‌బాబు, వార్డు సభ్యులు రేణుక, పిచ్చయ్య, వెంకటేశ్వర్లు, పుష్ప,. నాగేశ్వర్ రావు, సుజాత తదితరులున్నారు.

పీఏసీఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

హుజూర్‌నగర్: రైతులు పీఏసీఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. హుజూర్‌నగర్‌లో బుధవారం పీఏసీఎస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. వరి, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మగర్జన సభ జిల్లా కన్వీనర్‌గా ఫణికుమార్‌శర్మ

నేరేడుచర్ల: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఈ నెల 9వ తేదీన జరగనున్న బ్రహ్మగర్జన బహిరంగ సభ జిల్లా కన్వీనర్‌గా అన్నంబొట్ల ఫణికుమార్‌శర్మను నియమిస్తూ బుధవారం బ్రహ్మగర్జన సభ చైర్మన్ వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఫణికుమార్ శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు వారి హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని, బ్రహ్మగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

ఎస్‌బీఐ ఎదుట ధర్నా



నడిగూడెం ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

నడిగూడెం: ఫ్రీజ్ చేసిన రైతుల ఖాతాలను వెంటనే తెరవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం నడిగూడెం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల సమయంలో రూ.లక్ష రుణమాఫీ చేస్తామని హామీనిచ్చి విస్మరించారని ఆరోపించారు. పెట్టుబడి సాయం కింద మంజూరైన రైతు బంధు డబ్బులను రైతులకు చెల్లించాలని కోరారు. రైతుల ఖాతాలు ఫ్రీజ్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూతుకూరి వెంకటరెడ్డి, బృందావనపురం సర్పంచ్ బెల్లంకొండ హనుమయ్య, నాయకులు కొరట్ల శ్రీనివాస్, పుట్ట చంద్రయ్య, దాసరి రవి, కనుపాటి శ్రీను, కాసాని గోపాలకృష్ణ, బొడ్డు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



కోదాడ: ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



హుజూర్‌నగర్‌రూరల్: ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తున్న వీరమళ్ల సుందరయ్య

కోదాడ: ఇష్టానుసారంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి సాయికృష్ణ, సాయికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించి మాట్లాడారు. పట్టణంలో సగానికి పైగా ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. యూనిఫాం, బుక్స్, టై, బెల్టుల పేరుతో తల్లిదండ్రులను పీడిస్తున్నారన్నారు. వినతిపత్రం అందించిన వారిలో నక్క నవీన్, సందీప్‌కుమార్, సాయి, కల్యాణ్, నిఖిల్, విజయ్‌కుమార్, ఉపేందర్, కార్తీక్ ఉన్నారు.

హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్‌రూరల్ : అధిక ఫీజు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు వీరమళ్ల సుందరయ్య కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గూడెపు శ్రీనివాస్‌కు ఫిర్యాదు అందించిన అనంతరం ఆయన మాట్లాడారు. హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీచైతన్య, గ్రీన్‌ఉడ్ పాఠశాలల్లో స్కూల్ ఫీజు, పాఠ్య పుస్తకాలకు వేల రూపాయలు వసూలు చేస్తున్నారని, రశీదు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. పాఠశాల బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారన్నారు. పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా రవాణా శాఖ అధికారులు బస్సులను నామమాత్రపు తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, మండల విద్యాశాఖ అధికారి సైదానాయక్, ఆర్డీఓకు ఫిర్యాదు అందజేసినట్లు ఆయన తెలిపారు.

పంచాయతీ కార్మికుల సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

మునగాల: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూరి స్వరాజ్యం డిమాండ్ చేశారు. గురువారం నుంచి గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టబోయే సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం మునగాలలో వారు ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు బండారు గుర్వమ్మ, సంఘం నాయకులు రాజేష్, ధారావత్ రాజేష్, కుందూరు సీతారాములు తదితరులు పాల్గొన్నారు.



సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎస్‌టీఓకు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

హుజూర్‌నగర్: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం హుజూర్‌నగర్‌లోని ఎస్‌టీఓ కార్యాలయం వద్ద ఆ సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌టీఓ సావిత్రికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 11వ పీఆర్‌సీ కమిటీ వేయాలని, జిల్లాకు 2 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ ఏరియర్స్ వాయిదాల పద్ధతి కాకుండా ఏకమొత్తంలో ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పెన్షనర్లు పీఎల్ఎన్‌రెడ్డి, సైదులు, అంజయ్య, ఆంజనేయులు, వెంకటరెడ్డి, పద్మావతి, శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.